క్లుప్తంగా

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వీఆర్‌పురం: మండలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వీఆర్‌పురం తహసీల్దార్ కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో కోరారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సోమవారం ఉదయానికి భద్రాచలం 37 అడుగుల మేర వరద ప్రవాహం పెరుగుతుందన్నారు. కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని, 80081 00892 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రైతులకు మొక్కల పంపిణీ


కుంద్రుమ్‌లో మొక్కలు అందిస్తున్న సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ ఆనందరావు

దుంబ్రిగుడ: మండలంలోని కంద్రుమ్ పంచాయతీ స్వర్ణయిగుడ, కోరోంజీకుమడ, దండగుడ, సర్రాయి, ఉజ్జంగి గ్రామాల రైతులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన మొక్కలను ఆదివారం పంపిణీ చేశారు. ఒక్కొక్క రైతుకు 700 మొక్కల చొప్పున అందజేశారు. 99 మందికి 86 ఎకరాల్లో నాటేందుకు ఈ మొక్కలను పంచాయతీ సర్పంచ్ కె.హరి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్.బి.కళావతి, గిరిజన రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు మూడు బైక్‌లు


బైక్‌లు ప్రారంభిస్తున్న సీఐ హిమగిరి, తదితరులు

అరకులోయటౌన్: ట్రాఫిక్ నియంత్రణ కోసం అరకులోయ పోలీస్ స్టేషన్‌కు మూడు బైక్‌లు జిల్లా ఎస్పీ కేటాయించినట్లు సీఐ ఎల్.హిమగిరి తెలిపారు. ఈ మేరకు వాహనాలను ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పర్యాటకుల భద్రతకు ఈ వాహనాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ర్యాష్ డ్రైవింగ్, ఈవ్ టీజింగ్ వంటి వాటికి పాల్పడే వారిని ఈ వాహనాల ద్వారా పోలీసులు ఎల్లప్పుడు పర్యవేక్షిస్తుంటారన్నారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని విజిబుల్ పోలీసింగ్‌ను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ జి.గోపాలరావు, పోలీసులు పాల్గొన్నారు.

సంతల్లో జోరుగా మొక్కల విక్రయాలు


మొక్కలను కొనుగోలు చేస్తున్న జనం

సీలేరు: ఏజెన్సీలో వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. పలు వారపు సంతల్లో మిరప, వంగ నారును గిరిజనులు అమ్మకాలు చేస్తున్నారు. కడియం మొక్కలను సీలేరు, దారకొండ, చిత్రకొండ, మంగపాండు వంటి వారపు సంతల్లో ఆదివారం విక్రయించారు. పలు రకాల పూల మొక్కలతో పాటు మామిడి, కొబ్బరి మొక్కలను విక్రయాలు చేపట్టారు. ఎంతో రుచికరమైన వంటకాల్లో ఒకటైన ఎదురు కొమ్ములను కూడా విక్రయించారు.

ఘనంగా గ్రామదేవతల ఒడ్డు పండగలు


ప్రత్యేక అలంకరణలో మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలు ఒడ్డు పండగలు నిర్వహించారు. ఘాట్‌రోడ్డు చెరకు కాటా ఆవరణలో గల మోదమాంబ అమ్మవారికి ఘటాలు పండగను నిర్వహించారు. ఎం.కోటపాడు గ్రామానికి చెందిన కోట్ని వరహాలరాజు కుటుంబ సభ్యుల సారథ్యంలో అమ్మవారి ఘటాలు పండగ నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఎం.కోడూరు గ్రామంలో మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మింటే రాము నాయుడు కుటుంబ సభ్యుల సహకారంతో ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కుండపోత.. స్తంభించిన జనజీవనం


వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న ఉబ్బెంగుల వాగు


ఉధృతంగా ప్రవహిస్తున్న జామిగుడ గెడ్డ దాటి వెళ్తున్న ప్రజలు

కొయ్యూరు: భారీ వర్షం కుమ్మరించింది. ఏకధాటిగా నాలుగు గంటల పాటు పడిన వర్షానికి కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం జరిగిన కొయ్యూరు సంత వర్షాల కారణంగా బోసిపోయింది. కొయ్యూరు నుంచి రాజేంద్రపాలెం, మర్రివాడ, దొడ్డవరం రహదారులపై వరద నీరు ప్రవహించింది. ఉదయం ప్రారంభమైన వర్షం 11 దాటిన తర్వాత పెద్దదిగా మారింది. తర్వాత ఏకధాటిగా కురుస్తూనే ఉంది. జన జీవనం స్తంభించిపోయింది. సింగవరం ఐటీడీఏ కాలనీ సమీపంలో ఉన్న వట్టి కాలువ వంతెనపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. కొయ్యూరు సంతకు వచ్చిన వ్యాపారులకు నిల్వ నీడ లేకపోవడంతో తెచ్చిన వస్తువులు మొత్తం తడిసిపోయాయి. కొయ్యూరు, కాకరపాడు కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. అనకాపల్లి జిల్లాలోని తాండవ జలాశయానికి ప్రధాన ఇన్‌ఫ్లోగా ఉన్న తీగలమెట్ట కాలువ ఉధృతి పెరుగుతోంది.

పొంగి పొర్లుతున్న కొండ కాలువలు

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా ఆదివారం దాదాపు రోజంతా భారీ వర్షం కురిసింది. అటవీ ప్రాంతంలోని కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రాజవొమ్మంగి– కిమ్మిలిగెడ్డ గ్రామాల మధ్య ఉన్న ఒట్టిగెడ్డ వాగు(పెద్దేరు) ప్రవహిస్తుండడంతో వరదనీరు వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ రెండు రోజుల కిందటే పూర్తిగా నిండిపోగా.. ప్రస్తుతం మదుము ద్వారా దిగువకు పరవళ్లు తొక్కుతోంది. ఈ ప్రవాహం మరి కొన్ని కొండ కాలువలతో కలిసి రాజవొమ్మంగి జయలక్ష్మి థియేటర్ వద్ద, ఎర్రంపాడు వెళ్లే మార్గంలో, గింజర్తి వద్ద ఉరకలెత్తుతూ ఏలేరు ప్రాజెక్టు వైపు పరుగులు పెడుతోంది. ఈ నీటి ఉధృతికి రాజవొమ్మంగి–వయ్యేడు, బూరుగపల్లి, ముర్లవానిపాలెం, గింజర్తి, ఎర్రంపాడు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పొలాలకు వెళ్లిన వారు వాగు దాటలేక అక్కడే ఉండిపోయారు. వాగు ఉధృతి తగ్గితే ఇళ్లకు చేరాలని ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఎగువన కురుస్తున్న వర్షాలకు లబ్బర్తి, నెల్లిమెట్ల గ్రామాల మధ్య చిన్నేరు(మడేరు) పొంగి ప్రవహిస్తోంది. వాగు మరింత పెరగక ముందే త్వరగా పనులు ముగించుకుని గమ్యాలకు చేరారు. ఈ రాత్రికి ఈ వాగు ప్రవాహం మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

ముమ్మరంగా వరినాట్లు

వర్షాభావ పరిస్థితుల కారణంగా మెట్టలో వరినాట్లు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మడికట్టు నేలలో సంమృద్ధిగా నీరు చేరడంతో నాట్లు వేసే పనులు ముమ్మరం సాగుతున్నాయి. మరోవైపు భారీ వర్షాలకు మండలంలోని దాదాపు అన్ని సాగునీటి చెరువులు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ఈ ఖరీఫ్ సాగుకు నీటికి కొరత ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బెంగుల వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉబ్బెంగుల, దొరగూడ గ్రామాల గిరిజనులు జల దిగ్బంధంలో చిక్కుకున్నారు. మాకవరం, జోలాపుట్టు, దొడిపుట్టు, కర్రిముఖిపుట్టు, పనసపుట్టు పంచాయతీల్లో పలు గ్రామాల్లో పొలాల్లోకి భారీగా వరదనీరు చేరింది. భారీ వర్షాలతో వరద నీరు వచ్చి చేరడంతో మత్స్యగెడ్డ పూర్తి స్థాయి నీటితో కళకళలాడుతోంది.

సీలేరు: సీలేరు పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. వారం రోజులుగా మన్యం ప్రాంతంలో వింత వాతావరణం చోటు చేసుకుంటుంది. ఉదయం పూట మంచు, మధ్యాహ్నం ఎండ, ఆ తర్వాత ఉరుములు మెరుపులతో వర్షం పడుతుంది. సీలేరు, దారాలమ్మ తల్లి ఘాట్ రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సంతకు వచ్చిన గిరిజనులు తిరిగి తమ గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. మారుమూల గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


దేగలపుట్టు వద్ద వరదనీరు చేరడంతో మునిగిన పంట పొలాలు


కాజ్‌వేపై పొంగి ప్రవహిస్తున్న గేదె గెడ్డ


వట్టిగెడ్డ రిజర్వాయర్ పూర్తిగా నిండడంతో దిగువకు పొర్లుతున్న వరద నీరు


జలమయమైన సీలేరు మెయిన్ రోడ్డు


మడిగుంట వద్ద నీట మునిగిన పంట పొలాలు

లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

పెదబయలు: పెదబయలు మండలంలో దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతంలో కొనసాగుతున్న అల్పపీడన కారణంగా ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. దీంతో వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని కిముడుపల్లి పంచాయతీ చేదుపుట్టు సమీపంలోని గేదెగెడ్డ, జామిగుడ–గుంజివాడ గ్రామాల మధ్యలో గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దీంతో కిముడుపల్లి పంచాయతీకి రాకపోకలు నిలిచిపోయాయి.

చింతపల్లి: మండలంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఆదివారం పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయి. జనజీవనం స్తంభించింది.


భారీ వర్షాలకు రాజవొమ్మంగి- కిమ్మిలిగెడ్డ మధ్య ప్రవహిస్తున్న కొండ కాలువ

చంద్రబాబు మోసాలు ఇంటింటికీ వివరించాలి

- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు
- జామిగుడలో జోరు వానలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'


జామిగుడలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రుబాబు, పార్టీ నాయకులు

పెదబయలు: రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రశ్నించిన వారిని అక్రమ అరెస్టులు చేస్తూ రాక్షస పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు విమర్శించారు. ఆదివారం పెదబయలు మండలంలోని జామిగుడ పంచాయతీ కేంద్రంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం జోరు వానలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాలు ఇంటింటికీ వివరించాలన్నారు. చంద్రబాబు హామీలకు సంబంధించి క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్లలో స్కాన్ చేసి చూడాలన్నారు. ఎన్నికల సమయంలో బాబు ష్యూరిటీ పేరుతో ఇంటింటా బాండ్లు పంచిపెట్టారని, తీరా గెలిచిన తరువాత ఏ ఒక్క పథకం పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ బియ్యం పంపిణీ కార్యక్రమం చేపడితే చంద్రబాబు పాలనలో మళ్లీ పాత పద్ధతిలో కిలోమీటర్ల దూరంలో ఉన్న డీఆర్ డిపోలకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బాబు వస్తే జాబు గ్యారంటీ అని చెప్పి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల మంది వలంటీర్లను రోడ్డుపై పడేశారని, బియ్యం వాహనాలు, ఎండీఎంలు తొలగించారన్నారు. పెదబయలు మండలంలో సుమారు 2,100 మంది రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు వివిధ కారణాలతో జమ కాలేదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని, ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి ఇస్తామని ఇచ్చిన హామీని మరిచిపోయారన్నారు. సూపర్ సిక్స్ అమలు అరకొరగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు, రెడ్ బుక్ రాక్షస పాలన తప్ప, ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. మరోవైపు గ్రామ సచివాలయం వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. జామిగుడ గెడ్డ వంతెన నిర్మాణం నిధులు లేని కారణంగా నిలిచిపోయిందని, ప్రజలు వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జర్సింగి బాలంనాయుడు, మాజీ సర్పంచ్ భూపన్న, పార్టీ నాయకులు తెరవాడ వెంకటరావు, మఠం రామన్న పడాల్, మొండిపల్లి బాలన్న, సూరె రాముడు, ఇంతెంగి వెంకటరావు, చిట్టిబాబు, పంప సోమ్‌నాథ్, లక్ష్మయ్య, దేవిప్రసాద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ గృహ నిర్మాణ బకాయిలను వెంటనే చెల్లించాలి

చింతపల్లి: పీఎం జన్‌మన్ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న ఆదివాసీ గిరిజన కుటుంబాలకు బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ పరిధి తురుతుమ్‌పాడు గ్రామంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవితో కలిసి అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.లక్ష తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిన నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఆదివాసీలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు పూర్తయే దిశగా తక్షణమే పెంచిన నిధులు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా గతంలో పీవీటీజీలకు అంత్యోదయ పథకం ద్వారా పంపిణీ చేసే 50 కిలోల బియ్యాన్ని పునః ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రవి, సుబ్బారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం


ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న యూనియన్ నాయకులు

చింతూరు: ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం చింతూరులో డివిజన్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా యూనియన్ జెండాను ఎగురవేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డివిజన్ పరిధిలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. అనంతరం చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన సీనియర్ రిపోర్టర్లను సత్కరించి మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్, రమేష్, శ్రీనివాస్, రియాజ్, ఫిరోజ్, జీవన్, రామారావు, సతీష్ పాల్గొన్నారు.

చింతపల్లి: ఏపీయుడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రెస్‌క్లబ్ నాయకులు కాశీంవల్లీ, సురేష్, నరేష్, ప్రసాద్, శ్రీను, కోటి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటం జాస్తి...నాణ్యత నాస్తి!

- అసంపూర్తి రోడ్డు పనులతో అవస్థలు
- రూ.2.40 కోట్ల వ్యయం.. రెండు మండలాలకు ఆధారం
- ఆర్భాటంగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన కూటమి నేతలు
- రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు


కొండగెడ్డలో నీరు పోయేందుకు నిర్మించిన వంతెన


కల్వర్టుల సమీపంలో శిథిలమైన తారురోడ్డు

నాతవరం: రెండు మండలాలను అనుసంధానం చేస్తూ కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన తారురోడ్డు అసంపూర్తి పనులకు ప్రయాణికులకు నరకంగా మారింది. మండలంలో వల్సంపేట పంచాయతీ శివారు ఉటమల్ల గ్రామం నుంచి గొలుగొండ మండలం కశిమి పంచాయతీ శివారు వడపర్తి గ్రామం మధ్య మట్టిరోడ్డుకు ప్రభుత్వం రూ.2.40 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీర్లు ఆధ్వర్యంలో తారురోడ్డు పనులు చేపట్టారు. గత ఏడాది ఈ పనులకు ఇంజినీరింగ్ అధికారులు కూటమి నేతలతో భూమి పూజలు చేయించి ఆర్భాటంగా పనులు ప్రారంభించి ఈ ఏడాది మార్చి నాటికి తారురోడ్డు పనులు పూర్తి చేశారు. తారురోడ్డు వేసేటప్పుడు మధ్య రోడ్డుకు కొండగెడ్డలు ప్రవహించే ప్రదేశాలలో కల్వర్టులు, వంతెనలు నిర్మించారు. వంతెన, కల్వర్టులు నిర్మించిన ప్రదేశాల్లో పనులు అసంపూర్తిగా చేసి వదిలేయడంతో ఏ మాత్రం వర్షం పడినా నీరంతా రోడ్డుపై నిలిచిపోతుంది. కల్వర్టుల వద్ద తారురోడ్డుకు సమాంతరంగా పనులు చేయకపోవడంతో ఏమరు పాటుగా డ్రైవింగ్ చేసే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ తారురోడ్డు మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన ప్రాంతం కావడంతో ఉన్నతాధికారులు తాకిడి ఉండదన్న ఉద్దేశ్యంతో పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వంతెనలు, కల్వర్టులు ఉన్న ప్రదేశాలలో తారురోడ్డు శిథిలమై అధ్వానంగా మారింది. తారురోడ్డు నిర్మించి ఏడాది గడవక ముందే ఈ విధంగా తయారైతే రోడ్డు నాణ్యత ప్రమాణాలు ఏవిధంగా ఉన్నాయో అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గిరిజన ప్రాంతానికి తారు రోడ్డు వస్తుందని ప్రజలు ఆనందపడ్డారు. ఇపుడు అసంపూర్తి పనులతో రోడ్డును చూసి తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై నర్సీపట్నం పంచాయతీరాజ్‌శాఖ డీఈ ఈశ్వరరావును వివవరణ కోరగా ముందు తారురోడ్డు నిర్మాణం మార్చి నాటికి పూర్తి చేశామన్నారు. వంతెన, కల్వర్టుల వద్ద పరిస్థితి వివరించగా వంతెన వద్ద మార్జిన్లు పనులు చేయాలన్నారు. కల్వర్టుల సమీపంలో తారురోడ్డు రాళ్లు తేలిన ప్రదేశాలలో సిమెంటు రోడ్డు వేస్తామన్నారు. మిగతా రోడ్డంతా బాగానే ఉందని అన్నారు. ఈరోడ్డు పనులకు సంబంధించి ఇంకా ఆఖరి బిల్లు ఇవ్వలేదన్నారు.

రైవాడ జలాశయంలోకి పోటెత్తిన వరదనీరు


నిండుకుండలా ఉన్న రైవాడ రిజర్వాయర్

దేవరాపల్లి: గత రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల ధాటికి రైవాడ జలాశయంలోకి భారీగా వరదనీరు పోటెత్తుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. రైవాడ జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 111.80 మీటర్లకు చేరుకుంది. 113.50 మీటర్లకు చేరుకుంటే గేట్ల ద్వారా శారదానదిలోకి నీటి విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరిగేషన్ డీఈఈ జి. సత్యంనాయుడు తెలిపారు. ఏ సమయంలోనైనా నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున శారదానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికార్లు తెలిపారు.

ప్రమాద స్థాయిలో పెద్దేరు

మాడుగుల: పెద్దేరు జలాశయంలో ఆదివారం సాయంకాలానికి వరద పోటు పెరిగింది. జలాశయంలోకి 900 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అంతే వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.80 మీటర్ల ప్రమాద స్థాయికి చేరడంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు.

పిడుగుపాటుకు 28 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

చోడవరం: ఉరుములు, మెరుపులతో ఆదివారం పిడుగు పడి దుడ్డుపాలెం గ్రామంలో 28 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. కూర్మదాసు తాతారావుకు చెందిన 18 గొర్రెలు, కూర్మదాసు రమణకు చెందిన 5 గొర్రెలు, మొల్లి గోవిందకు చెందిన 5 గొర్రెలను గ్రామ సమీపంలో ఉన్న కొండపైకి శనివారం రాత్రి తీసుకెళ్లి ఉంచారు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా మొత్తం గొర్రెలన్నీ పిడుగుపాటుకు మృతి చెంది ఉన్నాయి. వీటి సుమారు రూ. 3 లక్షలు విలువ ఉంటుందని బాధిత పెంపకందారులు చెప్పారు.

ఫార్మా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లో ఫార్మా కంపెనీలో అనుమతులు లేకుండా డ్రగ్స్ తయారీ చేస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.డీఆర్‌ఐ సోదాలు బహిర్గతం చేయాలని కోరారు. అనుమతులు లేకుండా డ్రగ్స్ తయారు చేస్తున్న యాజమాన్యాన్ని అరెస్టు చేసి కంపెనీలు లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేయాలని డిమండ్ చేశారు. ఫార్మా కంపెనీలన్నిటిలోనూ సోదాలు చేసి అనుమతుల్లేని తయారీ దారులు, అందుకు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేప చేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.